మద్యం సిండికేట్ల దందా

- నిబంధనలకు తిలోదకాలు వదిలిన వ్యాపారులు
- బెల్టుషాపుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయం
- ఒక్కో షాపునకు రూ.25వేలు వసూలు చేసిన అధికార పార్టీ నాయకులు

డోన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణ యజమానులే బెల్టు దందాకు తెరలేపుతున్నారు. అధిక లాభాలు గడించేందుకు బెల్టుషాపుల నిర్వాహకులతో ఒప్పందం చేసుకుని అడ్డదారులు తొక్కుతున్నారు. డోన్ మండలంలో టీడీపీ నాయకులు సిండికేట్‌గా మారి పేదలను దోచుకుంటున్నారు.

డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 16 మద్యం దుకాణాలు ఉన్నాయి. బేతంచెర్ల మండలంలో 7, ప్యాపిలిలో 3 మద్యం షాపులు ఉన్నాయి. డోన్ పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలు అధికార పార్టీకి చెందిన ఒక వర్గం చేజిక్కించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో మరో రెండు దుకాణాలను ఆ పార్టీకే చెందిన సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయులు దక్కించుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గీయులకు, సుబ్బారెడ్డి వర్గీయులకు మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరడంతో ఒకరినొకరు ఆర్థిక మూలాలు దెబ్బతీసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా గత టీడీపీ హయాంలో మద్యం సిండికేట్‌లో కీలకపాత్ర పోషించిన వ్యక్తులను రంగంలోకి దింపి అధికార పార్టీలోని రెండువర్గాల మధ్య సిండికేట్ కోసం సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. సిండికేట్‌లో భాగస్వాములయ్యేందుకు సుబ్బారెడ్డి వర్గీయులు అంగీకరించలేదు. దీంతో డోన్ పట్టణంలోని నాలుగు ప్రధాన షాపులను సిండికేట్‌గా ఏర్పరిచి ఒక ప్రజాప్రతినిధి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం బెల్టుషాపులను ఒకవర్గం నిర్వహిస్తోంది.



డోన్ కంబాలపాడు సర్కిల్‌లోని హోటల్‌లో నిర్భయంగా మద్యం సేవిస్తున్న దృశ్యం



డోన్ మండలం కోట్లవారిపల్లెలో హోటల్‌లో మద్యం విక్రయిస్తున్న మహిళ

ఒక బెల్టుషాపుకు రూ.25 వేలు వసూలు

డోన్ పట్టణంలో సిండికేట్‌గా ఏర్పడిన మద్యం దుకాణ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయించేందుకు అధికార పార్టీకి చెందిన వ్యక్తులతో ఒక్కో బెల్టుషాపునకు రూ.25వేల చొప్పున వసూలు చేసి మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. తమ అక్రమ దందాను ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు విస్తరించాలని ఆయా మద్యం దుకాణాల యజమానులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీలోని మరోవర్గం ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా ఆ వర్గానికి ఉన్న మద్యం దుకాణాల పరిధిలో సైతం అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నారు.

క్వార్టర్‌పై రూ.10 అ'ధనం'

బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తానని బీరాలు పలుకుతున్న సీఎం చంద్రబాబునాయుడు డోన్ నియోజకవర్గంలో సొంత పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న సిండికేట్ దందా గురించి తెలుసుకోవాలని విపక్షాలంటున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.30 చొప్పున మద్యంబాబుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇందుకు కొందరు ఎక్సైజ్ అధికారులు కూడా ఉడతా భక్తిగా సహాయపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ బెల్టుషాపులు ఏర్పడడంతో తాగుబోతులతో వేగలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు



డోన్ పట్టణంలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయిన విషయం మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ అమ్మినా చర్యలు తప్పవు. గతంలో సిండికేట్ మాటున జరిగిన నకిలీ మద్యం విక్రయాల గురించి నాకు తెలియదు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయించినా, పైలెట్ల రూపంలో దౌర్జన్యాలు చేసినా ప్రజలు తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం.

–వరలక్ష్మి, ఎక్సైజ్ సీఐ, డోన్

అనధికార పైలెట్లు

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం అమ్మకాలు, నాటుసారా విక్రయాలను అరికట్టేందుకు సిండికేట్‌గా ఏర్పడిన మద్యం దుకాణాల యజమానులు ఒక ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి అందులో ఆరుగురు పైలెట్లను నియమించుకున్నారు. వీరు పట్టణంతో పాటు గ్రామాల్లో నాటుసారా స్థావరాలు, తయారీ కేంద్రాలపై అనధికారికంగా దాడులు చేస్తూ బెల్టుషాపుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లేందుకు తోడ్పడుతున్నారు. ఈ బెల్టుషాపుల సంస్కృతిని మొత్తం నియోజకవర్గంలోని 176 గ్రామాల్లో విస్తరించేందుకు అధికార పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. ప్రస్తుతం డోన్ మండలంలోని 53 గ్రామాల్లో సిండికేట్ వ్యవహారం విజయవంతంగా నడపగలిగితే మరో వారం రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా తమ సామ్రాజ్యాన్ని విస్తరించి తాగుడుకు బానిసలైన నిరుపేదల ఇళ్లు, ఒళ్లను గుల్ల చేయడం ఖాయం.

క్లుప్తంగా

డీవీఎంసీ సభ్యుడికి సన్మానం



బాలనాగన్నను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన కోవెలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన బోధనం బాలనాగన్నకు ఆదివారం స్థానిక రోటరీక్లబ్ భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అప్పపోగు వెంకటసుబ్బయ్య, రాయలసీమ స్టూడెంట్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, బీజేపీ నాయకుడు లింగన్న, ప్రజా సంఘాల నాయకులు ఓబయ్య, గంగన్న, ఓబులేసు, కత్తి ఓబులేసు, రాజు, బాలయ్య, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడ్డ ధాన్యం బస్తాల ట్రాక్టర్

కోవెలకుంట్ల: స్థానిక బనగానపల్లె చౌరస్తాలో ఆదివారం వడ్ల బస్తాల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. కోవెలకుంట్ల నుంచి బనగానపల్లెకు ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడడంతో వడ్ల బస్తాలు చెల్లా చెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ధాన్యం బస్తాలు పడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో స్థానికులు వాటిని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: నందిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జి విష్ణువర్ధన్‌రెడ్డి తల్లి రామలక్ష్మమ్మ(60) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఇటీవల ఆనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి ఉన్నారు.

దెబ్బతిన్న రైల్వే గేటు.. తప్పిన ప్రమాదం



వంగిపోయిన రైల్వే గేటు

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు వద్ద ఆదివారం ప్రమాదం తప్పింది. డోన్ వైపు నుంచి రైలు వచ్చే క్రమంలో గేట్‌మన్ గేటు వేశాడు. రైలు వెళ్లిన తరువాత గేటు తెరుస్తుండగా రైల్వే గేటు మధ్యలో వంగిపోయింది. ఆ సమయంలో వాహనదారులు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు స్పందించి గేటుకు మరమ్మతులు చేయించారు.

ఈయూలో చేరిక



ఈయూలో చేరిన ఎన్‌ఎంయూ కార్మికులు

డోన్ రూరల్: డోన్ ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్‌లోకి 20 మంది ఎన్‌ఎంయూ సభ్యులు చేరినట్లు ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య తెలిపారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం వారికి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈయూ రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దిలేటి, మజీద్, కె.సీతారామిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, ఏఐటీయూసీ నాయకులు పి.సుంకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

7న వడ్డెర్ల సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం వడ్డెర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి శిల్పిసుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఈ నెల 7న నంద్యాలలో నిర్వహిస్తున్న వడ్డెర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ ఆనందరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, రెడ్డిపల్లె, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆదివారం సీఐ రమేష్‌బాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు వస్తే గొడవలకు పోకుండా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. మార్పు కోరుకొని ప్రశాంత జీవనం గడపాలని సూచించారు.

క్రీడా మైదానాలు ప్రారంభం

డోన్ టౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రాంగణంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో నిర్మించిన క్రీడా మైదానాలను ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. డీఎస్పీ క్రీడాకారుల సౌకర్యార్థం షటిల్ కోర్టు, బాల్ బ్యాడ్మింటన్ కోర్టు, నెట్ క్రికెట్ ప్రాక్టీసు కోర్టులను సొంత నిధులతో ఏర్పాటు చేయడం, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, వేదపండితుడు శేషావలిశర్మ, టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ, కోచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.



మైదానాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీఎస్పీ

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం




అపస్ ఆవిర్భావ దినోత్సవంలో ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం అపస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీమాత, అహల్యాబాయ్ హోల్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 1982లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, వెంకట సుధీర్, శ్రీపతి, సుధాకర్‌రెడ్డి, ఉసేనయకయ, తిరుపతిరెడ్డి, వెంకట రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి బాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

డోన్: ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు డోన్ శివారులోని ఉడుములపాడు వద్ద నూతనంగా నిర్మించిన షిర్డీసాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 9వ తేదీ అఖండ దీపారాధన, విగ్రహ ప్రతిష్ఠ, చండీపారాయణం, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ గణపతి, కుబేర, పాశుపతి, రుద్ర హోమాలు, 11వ తేదీ చండీ పారాయణం, వేద పారాయణంతో పాటు మహా సుదర్శన హోమం ఉంటుందన్నారు. 12వ తేదీ చండీ హోమం, మూలమంత్ర క్షీర తర్పణం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ గణపతి, దత్తాత్రేయ, లక్ష్మీ, ఆంజనేయ, శివపార్వతులు, నంది, సాయిబాబా తదితర విగ్రహాలకు యంత్ర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.



ప్రారంభానికి ముస్తాబైన ఆలయం

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న రామాంజినేయులు

డోన్ రూరల్: చేతి వృత్తిదారులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజినేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో ఆదివారం చేతివృత్తిదారుల సమాఖ్య మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులను చిన్నచూపు చూడడం దారుణమన్నారు. విశ్వకర్మ యోజన పథకం కింద సాధారణ వృతిదారులకు సహాయం అందించకుండా డబ్బున్న వారికే ఉపయోగపడే విధంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నంద్యాల జిల్లా కార్యదర్శి రామ్మోహన్, సీపీఐ నాయకులు మోటారాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. కళాశాల ప్రాంగణంలో చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు సరస్వతి మాత అశీస్సులతో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఎస్ఐ మధుసూదన్ రావు, కళాశాల చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పురోహితులు వేణుగోపాల్ శర్మ, దాతలు టీసీ విజయ్ కుమార్, తోమంద్రుల లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన సరస్వతీదేవి విగ్రహం

సంస్కృతిని కాపాడుకుందాం



డోన్ టౌన్: హిందరూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సేవ్ టెంపుల్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో గ్లోబల్ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం మరమ్మతుల కోసం రూ.1.2 లక్షలు గ్రామ పెద్దలకు అందజేశారు. దేవాలయాలను పరిరక్షించుకోవడం హిందువుల ధర్మమని పేర్కొన్నారు. అనంతరం భారతమాత చిత్ర పటానికి పూజలు చేశారు. తల్లులకు పిల్లలతో పాద పూజ చేయించారు.

పిల్లలతో తల్లులకు పాద పూజ చేయిస్తున్న సభ్యులు

ఆగని స్టార్టర్ బాక్స్‌ల చోరీలు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో వరుసగా విద్యుత్ స్టార్టర్ బాక్కులు, కేబుళ్ల చోరీలు కలవరపెడుతున్నాయి. ఆరు నెలల్లో నాలుగుసార్లు చోరీలు జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో నెలలో సుమారు 20 మంది రైతులకు చెందిన విద్యుత్ తీగలు చోరీకి గురైన విషయం తెలిసిందే. తాజాగా గ్రామానికి చెందిన ట్యాక్ మోటర్ తీగ, రైతులు రామచంద్రుడు, హసన్‌షా, జక్కులయ్య, వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పది మంది రైతుల విద్యుత్ స్టార్టర్ మోటర్ల తీగలు చోరీకి గురయ్యాయి. సుమారు 100 మీటర్ల తీగ చోరీకి గురైందని రైతులు వాపోయారు. పోలీసులు స్పందించి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని వెలగటూరుకు చెందిన ఇద్దరు మట్కాబీటర్లను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన నాగార్జున, చౌడయ్య మట్కాబీట్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలు, రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు క్విజ్ పోటీలు

డోన్ రూరల్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం డోన్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆర్టీఓ క్రాంతికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మాలల యువగర్జనను విజయవంతం చేయాలి

అవుకు: కర్నూలులో ఈ నెల 23వ తేదీ తలపెట్టిన మాలల యువగర్జనను విజయవంతం చేయాలని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం కోరారు. ఆదివారం అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

డోన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల నంద్యాల జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సాదనగిరి సురేంద్ర, ప్రధాన కార్యదర్శిగా రహిల్‌బాషా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మద్దిలేటి, ఉపాధ్యక్షులుగా మురళిమోహన్, భారతి త్రేత, ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా నవీన్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, బాలుడు, కోఆప్షన్ సభ్యులుగా డాక్టర్ శివ, సుధాకర్, రాజశేఖర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



కబడ్డీ విజేత జట్టుకు నగదు బహుమతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో హజరత్ సయ్యద్ షా అల్లాబకాష్ ఖాద్రి ఉరుసును పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్ల బండలాగుడు, కబడ్డీ పోటీలు శనివారం హోరాహోరీగా జరిగాయి. ఎడ్ల బండలాగుడు పోటీల్లో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన కృష్ణ ప్రసాద్ వృషభాలు ప్రథమ స్థానం సాధించాయి. వైఎస్సార్ జిల్లా చెన్నూరుకు చెందిన గుమ్మల సాయికుమార్ రెడ్డి ద్వితీయ, కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన శశాంక్ తృతీయ, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి వృషభాలు నాలుగు, బేతంచెర్ల మండలం మేకల వెంకట్రాముడు 5, వెల్దుర్తి మండలం బోయినపల్లికి చెందిన ఎడ్లు 6వ స్థానంలో నిలిచాయి. దాతల సహకారంతో వరుసగా రూ. 30 వేలు, రూ. 20వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ. 4వేలు, రూ. 3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే కబడ్డీ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 35 జట్లు పాల్గొన్నాయి. ఓర్వకల్లు మండలం శకునాల జట్టు విజేతగా నిలిచింది. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ జట్టు ద్వితీయ, అనంతపురం జిల్లా తాడిపత్రి తృతీయ, బేతంచెర్ల మండలం ఎంబాయి జట్టు 4వ స్థానం కైవసం చేసుకుంది. దాతల సహకారంతో వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను అందజేశారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్ష

బనగానపల్లె రూరల్: పట్టణంలోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 115 మంది విద్యార్థులకు గాను 109 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారు. 28 ఆంధ్ర బెటాలియన్ వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ చీఫ్ ఆఫీసర్ అత్తార్‌సింగ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్ష జరిగింది. కర్నూలు గ్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ కల్నల్ అలోక్‌త్రిపాఠి తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్‌త్రిపాఠి

రేపు రథసప్తమి వేడుకలు

అవుకు: మండలంలోని శివవరం గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 4న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సామూహిక అర్చన, ఆదిత్యా హృదయ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణంతో పాటు భజన, ఛాయాదేవి కోలాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మంగళవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు జరుగుతాయన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం

కోవెలకుంట్ల: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం కోవెలకుంట్లలో నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలను గాలికొదిలేశారన్నారు. నాయకులు త్యాగరాజు, శేఖర్, రాములమ్మ, మద్దమ్మ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్లు ఆవిష్కరణ



సంజామలలో ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజామల: ఎస్సీ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకటరమణ కోరారు. ఈ మేరకు సంజామలలో పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం నాయకులు కంబగిరి రాముడు, మిద్దె సురేంద్ర, మల్లె మధు, హుసేని, శివ పాల్గొన్నారు.

రయ్యి.. రయ్యిమంటూ..!

- డోన్ రైల్వేస్టేషన్ రోడ్డులో స్కేటింగ్ శిక్షణ
- ఆసక్తి కనబరుస్తున్న చిన్నారులు



రోడ్డుపై దూసుకెళ్తున్న చిన్నారులు



స్కేటింగ్‌లో పాల్గొంటున్న చిన్నారులు

డోన్: స్కేటింగ్ అంటేనే నగరాలు, పెద్ద పట్టణాల్లోనే శిక్షణ ఉంటుందని.. అక్కడే ఈ క్రీడలు ఉంటాయని భావిస్తారు. అయితే డోన్‌లో స్కేటింగ్ శిక్షణ ఇస్తుండడంతో చిన్నారులు సత్తాచాటేందుకు శ్రమిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ క్రీడల అభివృద్ధికి చేసిన కృషి ఫలితంగా చిన్నారులు సైతం వివిధ క్రీడలపై ఆసక్తి కనబరుస్తున్నారు. టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టు, మైదానాలతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, స్విమ్మింగ్ పూల్‌లు డోన్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. విశాలమైన రోడ్లు నిర్మించారు. దీంతో పాతబస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు కిలోమీటర్ పొడవున్న రోడ్డులో చిన్నారుల కోసం స్కేటింగ్‌ను ఇటీవల ప్రారంభించారు. ప్యాపిలి మండలం ఎస్.రాచెర్ల గ్రామ ఉన్నత పాఠశాల పీఈటీ అశోక్ రెడ్డి చిన్నారులకు స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తే బాగుంటుందని పలువురు క్రీడాభిమానులు కోరుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే స్కేటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన చిన్నారులు రాణించాలని ఆకాంక్షించారు.

ఆసక్తి గమనించే



చాలామంది చిన్నారులకు స్కేటింగ్‌పై ఆసక్తి ఉందని గమనించాను. ఈ క్రీడలో మెలకువలు నేర్చుకునేందుకు చిన్నారుల తల్లిదండ్రులే సొంతంగా మెటీరియల్ కొనుగోలు సమకూర్చారు. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా స్కేటింకు అన్నివిధాలా ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహిస్తున్నారు.

–అశోక్‌రెడ్డి, పీఈటీ, ఎస్‌రాచెర్ల ప్రభుత్వ పాఠశాల